సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం . 5 . మే . 2025



వైభవోపేతం త్రిశూల, చక్రస్నానం

పుష్పగిరిలోని కామాక్షి వైద్యనాథేశ్వర స్వామి, లక్ష్మీ చెన్న కేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు ఆదివారం త్రిశూల, చక్రస్నానం, ధ్వజావరోహణంతో ముగిశాయి. -8లో



నమో వీరబ్రహ్మేంద్ర.!

బ్రహ్మంగారిమఠంలో జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. -8లో

గరిష్టం/కనిష్టం
40.9/28.6

వాతావరణం

జిల్లాలో ఆదివారం 28.6 - 40.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

వక్ఫ్.. మన హక్కు

- నినదించిన ముస్లింలు.. మద్దతు తెలిపిన పాస్టర్లు
- బీజేపీ, టీడీపీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు
- లాంగ్ మార్చ్ సక్సెస్

నల్ల రిబ్బన్లు తలకు చుట్టి.. జాతీయజెండాలు చేతబట్టి.. నిరసిస్తూ.. నినదిస్తూ.. అడుగులేస్తుంటే కడప గడప దద్దరిల్లింది. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టానికి వ్యతిరేకంగా చేసిన నినాదాలతో కడప నగరం హోరెత్తింది. బీజేపీ, టీడీపీ, జనసేన డౌన్ డౌన్ నినాదాలతో ముస్లిం యువత గర్జించింది. వక్ఫ్.. మన హక్కు... నల్ల చట్టాన్ని రద్దు చేయాల్సిందే అంటూ నినదించింది. ఆదివారం కడపలో జరిగిన లాంగ్‌మార్చ్ అశేష జనంతో విజయవంతమైంది.



లాంగ్‌మార్చ్ అనంతరం కడప నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద ఏర్పాటు చేసిన సభకు హాజరైన జనం



నల్ల జెండా చేతబట్టి వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న యువకుడు

కడప కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన లాంగ్ మార్చ్‌కు అద్భుత స్పందన వచ్చింది. జిల్లా వ్యాప్తంగా ముస్లిం, మైనార్టీలు, యువత, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున లాంగ్ మార్చ్‌కు తరలి వచ్చారు. వీరితో నగరంలోని రహదారులు కిక్కిరిసిపోయాయి. ఈ భారీ ర్యాలీకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించి పాల్గొంది. కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ కె. సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి ఈ ర్యాలీ వెంట అగ్రభాగాన నడిచారు. వైఎస్సార్‌సీపీతోపాటు కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఆర్‌సీపీ ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారంతా నల్లరిబ్బన్లు చేతికి కట్టుకొని, నల్ల జెండాలు, జాతీయ జెండాలు చేతబట్టుకొని నిరసన ప్రదర్శన చేశారు. ఇంక్విలాబ్ జిందాబాద్, బీజేపీ డౌన్ డౌన్, టీడీపీ డౌన్ డౌన్, జనసేన డౌన్ డౌన్ వంటి నినాదాలతో నగర వీధులు హోరెత్తాయి. గౌస్ నగర్ నుంచి ప్రారంభమైన లాంగ్ మార్చ్ మాసాపేట సర్కిల్, పెద్ద దర్గా, శివలింగం బీడి ఫ్యాక్టరీ, అల్మాస్‌పేట సర్కిల్, చిలకల బావి వీధి, రెండో గాంధీ బొమ్మ, వన్‌టౌన్ సర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిల్ మీదుగా ఏడు రోడ్ల కూడలి వరకూ చేరింది. అక్కడ అన్ని పార్టీల నాయకులు ప్రసంగించారు. కాగా పలు సర్కిళ్ల వద్ద పలువురు స్వచ్ఛందంగా మజ్జిగ, నీళ్లు, షర్బత్‌లు పంపిణీ చేయడం విశేషం.

టీడీపీ నేతలకు నిరసన సెగ..

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకంగా నిర్వహించే లాంగ్‌మార్చ్‌లో పాల్గొనేందుకు తెలుగుదేశం పార్టీ మైనార్టీ నేత అమీర్‌బాబు ఆధ్వర్యంలో వచ్చిన ఆ పార్టీ నేతలకు నిరసన సెగ తగిలింది. టీడీపీ నేతలను జేఏసీ నాయకులు అడ్డుకున్నారు. తెలుగుదేశం పార్టీ ముస్లింల గొంతు కోసిందని, టీడీపీ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆ పార్టీకి రాజీనామా చేసి ర్యాలీలో పాల్గొనాలని అమీర్ బాబును కోరారు. దీంతో చేసేదేమీ లేక ఆయన వెనక్కు తిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో మత గురువు హజరత్ మహమ్మద్ అలీ బగ్దాది, పెద్దదర్గా ముజావర్ అమీరుద్దీన్, ముఫ్తీ న్యామతుల్లా, పలువురు పాస్టర్లు, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకునే వరకూ పోరాటం

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కేంద్రప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకునేవరకు ముస్లిం, మైనార్టీలు చేసే ప్రతి పోరాటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన లాంగ్ మార్చ్‌కు ఎంపీ మద్దతు ప్రకటించి పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఒకరికి తీవ్రమైన అన్యాయం జరిగినప్పుడు మరొకరు స్పందించకపోతే అందరికీ అన్యాయం జరిగే అవకాశం ఉంటుందన్నారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగానికి, దేశానికి వ్యతిరేకంగా ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 26, 32లకు వ్యతిరేకంగా వక్ఫ్ చట్టంలో సవరణలు చేశారన్నారు. కులమతాలు, పార్టీలు, వర్గాలకతీతంగా ప్రతి ఒక్కరూ దీన్ని వ్యతిరేకిస్తున్నారని, దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ నిరసనలు వ్యక్తమవుతున్నాయన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభలోనూ, రాజ్యసభలోనూ దీన్ని వ్యతిరేకించిందని, సుప్రీం కోర్టులోనూ పిటిషన్ వేసిందని గుర్తు చేశారు. ముస్లిం, మైనార్టీలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కోవడానికి అన్ని రకాలుగా కృషి చేస్తామన్నారు. రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్న ఈ చట్టాన్ని ఉపసంహరించుకోకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలు, ఉద్యమాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

ముస్లింలకు జరుగుతున్న అన్యాయాన్ని ఖండించాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

ముస్లిం, మైనార్టీలకు జరుగుతున్న అన్యాయాన్ని పార్టీలు, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వక్ఫ్ చట్టాన్ని రద్దు చేసే వరకు ముస్లిం మైనార్టీలు చేసే ప్రతి పోరాటానికి వైఎస్సార్‌సీపీ తోడుగా ఉంటూ..అండగా నిలుస్తుందన్నారు. భారతదేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు ఐక్యంగా ఉన్నారని, ఆ ఐక్యతను దెబ్బతీసేవిధంగా ప్రవర్తించవద్దని హితవు పలికారు. వెంటనే ఈ నల్లచట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్ చట్టానికి మద్దతిచ్చిన పార్టీలకు రాజకీయ సమాధి

- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

వక్ఫ్ సవరణ చట్టానికి మద్దతు పలికిన పార్టీలకు రాజకీయ సమాధి తప్పదని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా హెచ్చరించారు. ముస్లిం, మైనార్టీల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలనే దురాశతోనే ఈ చట్టాన్ని తెచ్చారన్నారు. దేశ పౌరులకు భారత రాజ్యాంగం సమానత్వం కల్పించిందని, ఈ చట్టం ద్వారా అది దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఆర్టికల్ 25,26 ద్వారా ఎవరి మతపరమైన సంస్థలను వారే నిర్వహించుకోవచ్చని, అలా కాకుండా ఈ వక్ఫ్ సవరణ చట్టం ద్వారా వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు అవకాశం కల్పించడం దారుణమన్నారు. డా. బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి వ్యతిరేకంగా వక్ఫ్ చట్టంలో సవరణలు చేశారన్నారు. పార్లమెంటులో ఎన్‌డీఏకు పూర్తి మెజార్టీ లేదని, రాష్ట్రంలోని తెలుగుదేశం పార్టీ, జన సేన పార్టీలు దుర్మార్గంగా వ్యవహరించాయన్నారు. ముస్లిం మతపెద్దలు కలిసిన ప్రతిసారీ అండగా నిలుస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నమ్మించి గొంతు కోశారన్నారు. తన స్వార్థం కోసం ఎవరినైనా బలిచేసే చంద్రబాబును ముస్లింలు ఎప్పటికీ నమ్మబోరన్నారు. లాంగ్‌మార్చ్‌ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, ఆర్‌సీపీ నేత రవిశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సొహైల్, సుభాన్‌బాషా, వలీవుల్లా హుస్సేనీ, సంఘ సేవకుడు సలావుద్దీన్, అల్లాబకష్, రామమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





సభలో ప్రసంగిస్తున్న ముస్లిం, క్రిస్టియన్ల మత గురువులు



మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్ సీపీ నేతలు అంజద్‌బాషా,రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు



టీడీపీ నేత అమీర్‌బాబును అడ్డుకుంటున్న జేఏసీ నేతలు

ఆశయ సాధనకు మారుపేరు 'మహర్షి'

- జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్: అకుంఠిత దీక్ష, పట్టుదల, లక్ష్య నిర్దేశంతో చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని భగీరథ మహర్షి జీవిత సారాంశం తెలుపుతుందని.. జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ఎస్ హాలులో వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో పాటు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆశయ సాధన, అకుంఠిత దీక్షకు నిలువెత్తు నిదర్శనం అపర భగీరథ మహర్షి అని కొనియాడారు. రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి మాట్లాడుతూ మన జిల్లా వాసి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతులకు సాగు నీరందించాలనే గొప్ప ఆశయంతో నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించి అపర భగీరథుడయ్యారని గుర్తు చేశారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మి మాట్లాడారు. అంతకుముందు భగీరథ మహర్షి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి రాజ్యలక్ష్మి, బీసీ సంఘ నేత అవ్వారు మల్లికార్జున, జాతీయ ఎస్టీ, ఎస్సీ సంఘం అధ్యక్షులు జెవి రమణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నీట్



హాల్ టిక్కెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

కడప సెవెన్‌రోడ్స్: నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్–2025 ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో ఈ పరీక్ష నిర్వహించడం తొలిసారి కావడంతో జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. నిర్దేశించిన సమయం ముగిసిన తర్వాత వచ్చిన అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించలేదు. తమ పిల్లలు పరీక్ష రాస్తుండడంతో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద నిరీక్షించారు. పరిసర ప్రాంతాల్లో పోలీసులు 144 సెక్షన్ విధించారు.

- జిల్లాలో మొత్తం ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో 2371 మంది విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకోగా 2311 మంది హాజరు కాగా, 60 మంది గైర్హాజరయ్యారు.

న్యూస్‌రీల్

నేడు సమావేశం

కడప అగ్రికల్చర్: కడప నగర శివార్లలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నేడు, రేపు దక్షణ మండలి పరిశోధన , విస్తరణ సలహా మండల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం సమన్వయకర్తలు వీరయ్య, అంకయ్యకుమార్‌లు తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలలోని వ్యవసాయ జిల్లా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొంటారని వివరించారు.

కాల్ సెంటర్ ప్రారంభం

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి మీ కోసం కాల్ సెంటర్ 1100ను ప్రభుత్వం ప్రారంభించిందని, అర్జీదారులు తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి కాల్ చేయవచ్చని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

- ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో తెలిపారు.

భూ ఆక్రమణలపై చర్యలు

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వ, ప్రైవేటు భూముల ఆక్రమణకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీధర్ హెచ్చరించారు. పాతకడప చెరువు భూమి ఆక్రమణకు గురైందంటూ ప్రధాన దినపత్రికల్లో వచ్చిన వార్తలపై కలెక్టర్ స్పందించారు. ఆదివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రావెల్ ఎవరు తోలారో సమగ్ర విచారణ చేయా లని కడప తహసీల్దార్‌ను ఆదేశించారు. చెరువులో ఆక్రమణలు జరిగినట్లు వచ్చిన వార్తలపై లోతైనా విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలంటూ ఆర్డీఓ, తహసీల్దార్‌లను ఆదేశించారు.

పల్లె వైద్యంపై కాల కూటమి విషం

- పది నెలలుగా అద్దె భవనాలకు అందని బాడుగలు..కరెంటు బిల్లులు
- న్యాయమైన కోర్కెల సాధన కోసం సమ్మె బాట పట్టిన సీహెచ్‌ఓలు
- సమ్మెలో ఉన్న సిబ్బందికి వేతనాలు నిలుపుదల చేసిన ప్రభుత్వం



విలేజ్ హెల్త్ క్లినిక్



కడపలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌ఓలు

కడప రూరల్: ప్రభుత్వ వైద్యరంగంపై తెలుగు దేశం ప్రభుత్వం పగబట్టింది. ప్రజలకు ఎప్పటికప్పుడు మెరుగైన వైద్య సేవలను అందించాల్సింది పోయి కాల కూట విషం కక్కుతోంది. ఆఖరికి భూ మాతను నమ్ముకొని జీవనం సాగించే వారి ఆరోగ్య పరిరక్షణకు, పాటు పడే విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పర్యవేక్షణను గాలికి వదిలేసింది. అందులో కీలకమైన విధులను చేపడుతున్న సీహెచ్‌ఓ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్)లపై కాస్తయినా కరుణ చూపకపోగా కాఠిన్యంగా ప్రవర్తించడం, దారుణ పరిస్థితికి అద్దం పడుతోంది.


- అద్దె భవనాల్లో కొనసాగుతున్న క్లినిక్‌లకు ప్రభుత్వం పది నెలలుగా బాడుగలు..కరెంట్ బిల్లులను చెల్లించలేదు. ఒక క్లినిక్‌కు ఒక నెలకు రూ 1000 నుంచి రూ 3,500 వరకు బాడుగ, కరెంట్ బిల్లు రూ 300 నుంచి రూ 400 వరకు ఉంటుంది. ఈ బిల్లులను సీహెచ్‌ఓలే చెల్లించడం గమనార్హం

జిల్లాలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వివరాలు

మొత్తం విలేజ్ హెల్త్ క్లినిక్‌లు: 387	ఒక క్లినిక్‌కు ఒక రోజుకు వచ్చే రోగులు : 25
అద్దె భవనాల్లో నడుస్తున్న క్లినిక్‌లు : 80	లభించే మందుల రకాలు : 105
	వైద్య పరీక్షల రకాలు: 14

ప్రభుత్వం బెదిరింపుల ధోరణి

ప్రభుత్వం సమ్మెలో సీహెచ్‌ఓలపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లుగా తెలిసింది. జిల్లా వ్యాప్తంగా సమ్మెలో ఉన్న సిబ్బందికి ఏప్రిల్ నెల వేతనాలు మే నెలలో వేయలేదు. ఒకరికి ఒక నెల వేతనం రూ 25 వేల వరకు వస్తుంది. సమ్మెలో పాల్గొనని సిబ్బందికి దాదాపు 10 మందికి మాత్రమే 25 రోజులకు గాను రూ 21 వేలు వేశారు. మిగతా వారికి ఒక్క పైసా కూడా జమ చేయకపోవడం దారుణం.



నాడు ఆరోగ్య వెలుగులు

కేంద్ర పథకానికి సంబంధించిన నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా ఆరోగ్య ఆయుష్మాన్ మందిర్ కింద 2019 నుంచి ఎంఎల్‌పీహెచ్‌ల (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్) బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన వారితో నియామకాలను చేపట్టారు. ప్రస్తుతం ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్)లుగా పిలుస్తున్నారు. గతంలో వీరి కోసం పల్లెల్లో అక్కడక్కడా విసిరేసినట్లుగా సబ్ సెంటర్స్ ఉండేవి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వైద్య రంగం స్వరూపమే మారిపోయింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణుల చెంతకే వైద్య సేవలు వెళ్లాలనే సంకల్పంతో సబ్ సెంటర్స్ స్థానంలో బహు ప్రయోజనకరమైన 'విలేజ్ హెల్త్ క్లినిక్'లను ఏర్పాటు చేశారు. అందుకోసం పక్కా భవనాలను నిర్మించారు. అక్కడ ప్రాథమిక వైద్యంతో పాటు దీర్ఘకాలికి వ్యాధులకు సైతం వైద్యం లభించేలా ల్యాబొరేటరీ, వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన మందులను సిద్ధం చేశారు. ఈ క్లినిక్‌లో సీహెచ్‌ఓలది ప్రధాన పాత్ర. వీరే వైద్య పరీక్షలు నిర్వహిస్తారు, వ్యాధిని నిర్ధారిస్తారు. మందులను ఇస్తారు. ఏదైనా పెద్ద వ్యాధి అయితే పీహెచ్‌సీ లేదా ఇతరు ఆసుపత్రులకు రెఫర్ చేస్తారు.

నేడు దుర్భర బతుకులు

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలల నుంచి గ్రామీణ వైద్యానికి గ్రహణం పట్టుకుంది. సీహెచ్‌ఓలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసిన సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలని...ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని.. బకాయిలను వెంటనే చెల్లించాలి. ఇంక్రిమెంట్ బదిలీలు, ఎక్స్‌గ్రేషియా, పీఎఫ్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆ మేరకు ఏపీ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో సీహెచ్‌ఓలు నిరవధిక సమ్మెకు దిగారు. ఆ మేరకు జిల్లాలో ఏప్రిల్ 28వ తేదీ నుంచి విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో చాలా వరకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మూత పడ్డాయి. తాజాగా సీహెచ్‌ఓల విధులను ఏఎన్‌ఎంలు చేపట్టాలని చాలా ఆలస్యంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లుగా తెలిసింది. ఏఎన్‌ఎంలకు క్షేత్ర స్థాయిలో పని భారం ఎక్కువగా ఉంటుంది. మరి పల్లె వాసులకు వైద్య సేవల లభించే సంగతి దేవుడికే ఎరుక.

సమస్యలను పరిష్కరించాలి



న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించాం. తప్పని పరిస్థితుల్లోనే సమ్మెకు దిగాం. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారమే తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం. ప్రభుత్వం మా సమస్యలను ఆలకించాలి. మాకు న్యాయం చేయాలి. మా ఆందోళనకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలి.

- కే గిఫ్టీ షీలా, జిల్లా అధ్యక్షురాలు, ఏపీ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అసోసియేషన్

క్లుప్తంగా

ఫర్నీచర్‌ షాపులో అగ్నిప్రమాదం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక పాత బీవీఎస్‌ హాల్‌ సమీపంలో ఉన్న బాహుబలి ఫర్నీచర్‌ షాపులో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్‌ సర్క్యూట్‌ వల్ల జరిగిన ఈ ప్రమాదంలో షాపులోని ప్లాస్టిక్‌ డైనింగ్‌ టేబుళ్లు, చైర్లు, ఇతర వస్తువులన్నీ పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పేశారు.

విద్యుత్‌ షాక్‌తో గేదె మృతి

బి.కోడూరు : మండలంలోని ప్రభలవీడు పంచాయతీ పరిధిలోని తిప్పరాజుపల్లె గ్రామానికి చెందిన గంగిరెడ్డి నాగమునిరెడ్డికి చెందిన గేదె ఆదివారం సాయంత్రం విద్యుత్‌ షాక్‌కు గురై మృతి చెందింది. ఊరి బయట ఉన్న పొలాల్లోకి మేత కోసం వెళ్లి పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద విద్యుత్‌ షాక్‌కు గురైంది. గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, సంబంధిత అధికారులు ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

వడదెబ్బతో గొర్రెల కాపరి..


వడదెబ్బతో మృతి చెందిన నారాయణ

సింహాద్రిపురం : వడదెబ్బతో గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన సింహాద్రిపురం మండలం లోమడ గ్రామంలో జరిగింది. బంధువులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మేకల నారాయణ (53) గొర్ల కాపరిగా వెళ్లేవాడు. రోజు మాదిరిగా ఆదివారం ఆయన గొర్రెలను మేపేందుకు వెళ్లాడు అక్కడ తీవ్ర వేడికి వడదెబ్బ తగిలి స్పృహ కోల్పోయి పడిపోవడంతో తోటి కాపర్లు వెంటనే ఆటోలో తొండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇతనికి భార్య, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు అందరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారే. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మృతుని కుటుంబానికి సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆటో బోల్తాపడి..


మృతి చెందిన చిన్నయ్య

అట్లూరు : బద్వేలు మండలం రాజుపాలెం గ్రామ సమీపంలో కడప - బద్వేలు ప్రధాన రహదారిపై ఆదివారం ఆటో బోల్తాపడిన ప్రమాదంలో అట్లూరు మండలం ఎస్‌.వెంకటాపురం అక్కిరెడ్డిగారిపల్లె కాలనీకి చెందిన పాత్తపి చిన్నయ్య (58) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, బంధువుల వివరాల మేరకు చిన్నయ్య బద్వేలుకు వెళ్లి సెల్‌ఫోన్‌కు పాచ్‌ వేయించుకుని వస్తానని చెప్పి ఇంటి నుండి బయలుదేరాడు. ఏపీ39 టీపీ 6930 నెంబరు గల ఆటోలో ఎక్కి రాజుపాలెం గ్రామ సమీపానికి వెళ్లే సరికి ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి చిన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడని, మరి కొంత మందికి గాయాలయ్యాయని తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఈ మేరకు బద్వేలు రూరల్‌ పోలీసులు ఆటోడ్రైవర్‌ వల్లంకొండు నరసింహులుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

నమో వీరబ్రహ్మేంద్ర..!


భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు


విద్యుత్‌ దీపాలంకరణలో దేవస్థానం

- ఘనంగా ఆరాధనోత్సవాలు ప్రారంభం
- స్వామి వారికి ప్రత్యేక పూజలు
- భారీగా తరలివచ్చిన భక్తులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో జగద్గురు శ్రీ మద్విరాట్‌ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున వీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అర్చనామూర్తులకు ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలలో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమాన్ని జరిపారు. సాయంత్రం వేదపారాయణం చేశారు.

కమనీయంగా శేషవాహనోత్సవం

రాత్రి శేషవాహనోత్సవం కమనీయంగా సాగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పంచ శిరస్సులు గల శేషవాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి జగన్మాత శ్రీ ఈశ్వరీదేవి మఠం వరకు ఊరేగించారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్ద మఠం చేరుకుంది. ఉత్సవానికి ప్రొద్దుటూరు పట్టణ పరిధి గురువయ్యతోటలోని కాలేజ్‌ రోడ్డుకు చెందిన పేర్ల వెంకట బ్రహ్మానందరెడ్డి, గుంటూరు జిల్లా క్రోసూరుకు చెందిన చేపూరి నరసింహాచారి, ఆయన భార్య విజయలక్ష్మి ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి భక్తుల కాలక్షేపం కోసం యడవల్లి రమణయ్య భాగవతార్‌ ఆధ్వర్యంలో హరికథా గానం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి, అమ్మ వారిని దర్శించుకుని తరించారు. దాతలు అన్నదానం, మజ్జిగ, వాటర్‌ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాలు విరివిగా చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠం ఫిట్‌పర్సన్‌ సి.శంకర్‌బాలాజీ, మేనేజర్‌ ఎస్‌.ఈశ్వరయ్య ఆచారి ఏర్పాట్లు చేశారు.

ఈ కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, భద్రయ్యస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, గోవిందు స్వామి తదితరులు పాల్గొన్నారు.

బి.మఠం దేవస్థానంలో అభివృద్ధి భేష్‌

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం అభివృద్ధి భేష్‌గా ఉందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ ప్రశంసించారు. ఆదివారం బి.మఠం దేవస్థానం పరిధిలో రూ 3.40 కోట్ల నిధులతో చేపట్టిన పనులను ఆయన ప్రారంభించారు. ఇందులో మఠం ప్రాకారం, కల్యాణ మండపం, టీటీడీ సదనంలో సీసీ ఫ్లోరింగ్‌, పోలేరమ్మ గుడి వద్ద టాయిలెట్‌ బ్లాక్‌, గుడి ఆవరణలో ఫ్లోరింగ్‌ తదితర పనులకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతం కన్నా ఇప్పుడు బ్రహ్మంగారిమఠం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అందరి సహకారంతో బి.మఠం దేవస్థానం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మఠం అభివృద్ధిలో భాగంగా తొలగించిన తాత్కాలిక బస్‌ షెల్టర్‌ స్థానంలో రూ.10 లక్షలతో త్వరలోనే బస్‌ షెల్టర్‌ ఏర్పాటు చేయిస్తామన్నారు. అలాగే బస్‌ స్టేషన్‌ ఏర్పాటుకు కూడా కృషి చేస్తానన్నారు.


బి.మఠం దేవస్థానంలో నూతన కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌ యాదవ్‌

వైభవోపేతం త్రిశూల, చక్ర స్నానం

ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు ఆదివారం త్రిశూల, చక్ర స్నానం, ధ్వజావరోహణం కార్యక్రమాలతో ఘనంగా ముగిశాయి. శ్రీ వైద్యనాథేశ్వర స్వామి త్రిశూలం, శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి చక్ర తాళ్వార్‌ల స్నానాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. పుష్పగిరి గ్రామంలోని శ్రీ వైద్యనాథస్వామి ఆలయం నుంచి కామాక్షీ సహిత వైద్యనాథ స్వామిని, త్రిశూలాన్ని , కొండపైనున్న శ్రీ లక్ష్మీ చెన్న కేశవ ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవ స్వామిని, చక్ర తాళ్వార్‌ను మేళ తాళాలతో, డప్పువాయిద్యాలతో పల్లకిలో మోస్తూ ఊరేగింపుగా పెన్నా నది వద్దకు తీసుకుని వచ్చారు. అక్కడ భక్తులు స్వామివార్లకు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన అర్చకులు అఖిల్‌ దీక్షితులు, శ్రీనివాసమూర్తిల ఆధ్వర్యంలో స్వామి వార్ల త్రిశూలం, సుదర్శన చక్రాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పాలు, చందనం, నెయ్యి, పెరుగు, పసుపు, పన్నీరు, కొబ్బరి నీరుతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి చక్ర స్నానాలతో పాటు స్నానాలు చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజున కళశాలలో ఉంచిన నవ ధాన్యపు మొలకలను శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి నీటిలో కలిపారు. అనంతరం రెండు ఆలయాల్లో ధ్వజావరోహణం చేసి, పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలను ముగించారు.


శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవుని పుష్పయాగం

కనుల పండువగా పుష్పయాగం..

ఆదివారం రాత్రి శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామికి పుష్పయాగాన్ని కనుల పండువగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో, వేద మంత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి నిర్వహించిన పుష్పయాగాన్ని చూసిన భక్తులు పులకించారు. రాత్రి శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామి రావణేశ్వర వాహనంపై కొలువు దీరిన శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వాములకు తిరుచ్చి వాహన సేవలో భాగంగా గ్రామ మాడ వీధుల్లో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.


త్రిశూలం, చక్రాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్‌ : ప్రతి ఒక్కరూ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. ఇటీవలి కాలంలో సైబర్‌ మోసాలు అధికమవుతున్న తరుణంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ డీఆర్‌ఓ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలను మోసగించేందుకు నేరస్తులు కొత్త కొత్త మార్గాలను అనుసరిస్తున్నారన్నారు. ముఖ్యంగా వాట్సాప్‌, ఫేస్‌బుక్‌ వంటి సోషల్‌ మీడియా యాప్స్‌ను ఉపయోగించి, ప్రభుత్వ అధికారులు, బ్యాంకు ఉద్యోగుల పేరుతో ఫేక్‌ ఖాతాలు సృష్టిస్తూ ప్రజల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారన్నారు.

వాట్సాప్‌ డీపీ మోసం విధానం

నేరస్తులు జిల్లా కలెక్టర్‌ లేదా ఇతర ఉన్నతాధికారుల ఫోటోను ఉపయోగించి వాట్సాప్‌ ఖాతా రూపొందిస్తున్నారన్నారు. ఆ ఖాతాల ద్వారా 'అత్యవసరంగా డబ్బు పంపండి' అనే సందేశాలు పంపుతున్నారని, కొంత మంది వాటిని నిజమైన అధికారుల ఖాతాలుగా నమ్మి డబ్బులు సైతం పంపుతున్నారని తెలిసిందన్నారు.

ప్రజలకు సూచనలు

- అధికారుల పేరుతో వచ్చే మెసేజ్‌లు, కాల్స్‌ను నమ్మరాదు.
- ఎవరు డబ్బు అడిగినా – మొదట ఆ వ్యక్తి నిజమైన అధికారేనా అనే విషయాన్ని అధికారికంగా నిర్ధారించుకోవాలి.
- తెలియని లింకులు, ఫొటోలు, ఫైళ్లను ఓపెన్‌ చేయవద్దు.
- వాట్సాప్‌ డీపీ చూసి నమ్మకండి–అవి ఫేక్‌ కావొచ్చు.
- అనుమానాస్పదమైన విషయాన్ని వెంటనే స్థానిక అధికారులకు లేదా పోలీసులకు తెలియజేయాలి

సైబర్‌ మోసాలకు ఫిర్యాదు చేయాలంటే..

- సైబర్‌ హెల్ప్‌లైన్‌ నంబర్‌: 1930
- ఆన్‌లైన్‌ ఫిర్యాదు వెబ్‌సైట్‌: డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైమ్‌.జీఓవీ.ఇన్‌
- ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి సందేహాస్పద మెసేజ్‌లు వచ్చినా వెంటనే అధికారులను సంప్రదించి నిజాన్ని తెలుసుకోవాలి. మోసాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలని డీఆర్‌ఓ ఆ ప్రకటనలో తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ బాబూకాలనీకి చెందిన నాగరాజు(35) కుటుంబ సమస్యలతో భార్య మల్లీశ్వరితో గొడవపడటంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన నాగరాజు, ఏప్రిల్‌ 28వ తేదీన పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్‌ చేశారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడన్నారు.

ఎట్టకేలకు మహానాడు స్థలం ఎంపిక!

- కడప నియోజకవర్గ పరిధిలోనే నిర్వహణకు పార్టీ జిల్లా అధ్యక్షుడి పట్టు
- చివరకు కమలాపురం పరిధిలో నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్‌
- టీచర్స్‌ హౌస్‌బిల్డింగ్‌ సొసైటీ భూమిలో ఏర్పాటుకు సన్నాహాలు

సాక్షి ప్రతినిధి, కడప : కడప నియోకవర్గంలోనే మహానాడు నిర్వహణ చేపట్టాలని కొందరు, అక్కొద్దు కమలాపురం పరిధిలో నిర్వహించడం శ్రేయస్కరమని మరికొందరు.. ఇలా ఎవరికి వారు తెలుగు తమ్ముళ్లు పట్టుబట్టారు. జిల్లాలో ఉన్న అంతర్గత విభేదాల కారణంగా స్థల ఎంపిక టీడీపీ పెద్దలకు శిరోభారంగా మారింది. నాలుగు పర్యాయాలు పరిశీలన అనంతరం ఎట్టకేలకు పబ్బాపురం–చెర్లోపల్లె భూములల్లో నిర్వహించేందుకు తుది నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు భూమి పూజ చేపట్టి జంగిల్‌ క్లియరెన్స్‌కు శ్రీకారం చుట్టారు.

ఈనెల 27న జిల్లాలో మహానాడు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అయితే కడపలోనే చేపట్టాలని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి పట్టుబట్టారు. ముందుగా ఎయిర్‌పోర్టు సమీపంలో నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనకు వచ్చారు. అక్కడ టీడీపీ నేత ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డికి చెందిన భూములు ఉండడంతో వద్దని ఎన్జీఓ ప్లాట్స్‌లో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఎన్జీఓలలో అసంతృప్తి నెలకొనడం, పైగా అక్కడ నిర్వహణ కారణంగా కడప నగరంలో ట్రాఫిక్‌ సమస్య ఉత్పన్నం కానున్నట్లు గుర్తించారు. ఎవరెన్ని చెప్పినా అక్కడే నిర్వహించాలని జిల్లా అధ్యక్షుడు పట్టుబట్టారు. ఈ క్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సహా నాలుగు పర్యాయాలు టీడీపీ బృందాలు పరిశీలన చేపట్టారు. ఒక దశలో జిల్లాలో తెలుగు తమ్ముళ్ల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాల కారణంగా మహానాడు నిర్వహణపై అంతర్మథనంలో పడ్డారు.

తెలుగు తమ్ముళ్ల మధ్య ఆధిపత్యపోరు..

వైఎస్సార్‌–అన్నమయ్య జిల్లాలో 9 మంది ఎమ్మెల్యేలు కూటమి సర్కార్‌లో ఉన్నారు. ఈ మారు మహానాడు వైఎస్సార్‌ జిల్లాలో చేపట్టి పట్టు చేజారిపోకుండా జాగ్రత్త పడాలనే దిశగా సీఎం చంద్రబాబు అడుగులు వేశారు. తొలి అడుగులోనే టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు ఉన్నట్లు అధిష్టానానికి స్పష్టమైంది. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అంతా తానై వ్యవహరించాలనే ధోరణికి మిగిలిన నేతలంతా చెక్‌ పెట్టారు. కడప నియోజకవర్గ పరిధిలోనే మహానాడు నిర్వహించాలనే ఒంటెత్తు పోకడకు వెళ్లారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అభిప్రాయం కూడా పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించినట్లు సమాచారం. జిల్లాలోని ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు మహానాడు నిర్వహణ విషయంలో అధ్యక్షుడి వైఖరిపై అధిష్టానానికి పలు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఆ క్రమంలోనే రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్థల పరిశీలనకు వచ్చారు. ఆయన సమక్షంలో కూడా ఎన్జీఓ ప్లాట్స్‌లో నిర్వహించాలనే దిశగా జిల్లా అధ్యక్షుడు పట్టుబట్టినట్లు సమాచారం.

అధ్యక్షుడితో నిమిత్తం లేకుండా స్థల ఎంపిక..

మహానాడు నిర్వహణకు చింతకొమ్మదిన్నె మండలంలో చెర్లోపల్లె టీచర్స్‌ హౌస్‌ బిల్డింగ్‌ సొసైటీ భూముల్లో ఏర్పాటు శ్రేయస్కరమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఆ మేరకు ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిలు పరిశీలించి, వాస్తవ పరిస్థితులను అధిష్టానానికి తెలియజేశారు. మహానాడు నిర్వహణకు రింగురోడ్డు కలిసివచ్చే అంశమని తెలియజేశారు. ఆదివారం ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, రాముగోపాల్‌రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్‌ దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, వాస్తు సిద్ధాంతి జయరామిరెడ్డిలు పరిశీలించి, టీచర్స్‌ హౌస్‌ బిల్డింగ్‌ సొసైటీలో నిర్వహణకు తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ మొత్తం వ్యవహారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డితో నిమిత్తం లేకుండా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఆ మేరకు హౌస్‌ బిల్డింగ్‌ సొసైటీ ప్రతినిధుల అనుమతితో జంగిల్‌ క్లియరెన్స్‌ చేపట్టేందుకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం.

ట్రాక్టర్‌పై నుంచి కింద పడి..

రాజంపేట : రాజంపేట అర్బన్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలో సున్నపురాళ్లపల్లె వద్ద జరిగిన ప్రమాదంలో హేమాద్రివారిపల్లె వాసి బి.వెంకటేశు(30) మృతి చెందాడు. శనివారం రాత్రి కదులుతున్న ట్రాక్టర్‌పై నుంచి కింద పడ్డాడు. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. అర్బన్‌ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగుకు చెందిన నరసింహారెడ్డి(45), అదే గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి(40) ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో అంగళ్లుకు వస్తుండగా, మార్గమధ్యంలో అంగళ్లు సమీపంలో టాటా సుమో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గాయపడిన వెటర్నరీ అసిస్టెంట్‌ మృతి

కలకడ : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వెటర్నరీ అసిస్టెంట్‌ మృతి చెందినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ మండలం నడిమిచెర్ల గ్రామానికి చెందిన మురాషా కుమారుడు రెడ్డి ఖాదర్‌ బాషా(29) కలకడ మండలం బాలయ్యగారిపల్లె పంచాయతీ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి చిత్తూరు –కర్నూలు జాతీయ రహదారిపై కలకడ–కేవీ పల్లె మండల సరిహద్దు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన ఖాదర్‌బాషాను కలికిరి మండలం మహల్‌ ప్రభుత్వ ఆసుత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య షేక్‌ ఆఫిజున్నీసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఏపీజీబీలో అడ్డగోలు పదోన్నతులు

- చక్రం తిప్పిన జీఎం స్థాయి అధికారి
- రూ.లక్షల్లో వసూలు
- కంప్యూటర్‌ ఇంక్రిమెంట్‌ అరియర్స్‌లో గోల్‌మాల్‌

టాస్క్‌ఫోర్స్‌ : ప్రభుత్వం ఇటీవల ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌, ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ వికాస్‌ బ్యాంక్‌, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌, సప్తగిరి గ్రామీణ బ్యాంకులన్నింటిని కలిని ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ బ్యాంక్‌గా అమరావతిలో ఏర్పాటు చేస్తూ గెజిట్‌ నోటిఫికేషన్‌ వచ్చింది.

ఈ తరుణంలో బ్యాంకుల్లో ఎవరికి కూడా పదోన్నతులుగానీ, బదిలీలు కానీ నిర్వహించకూడదని ప్రభుత్వం నిబంధనలను విధించింది. ఇదే అదనుగా భావించిన జనరల్‌ మేనేజర్‌ స్థాయి అధికారి ఒకరు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పనిచేసే ఫీల్డ్‌ అసిస్టెంట్లకు, మేనేజర్లు, సీనియర్‌ మేనేజర్లకు కలిసి 27 మందికి గత నెలలోనే (గెజిట్‌ కాకముందు) పదోన్నతి కల్పించడంతోపాటు బదిలీలను కూడా నిర్వహించినట్లు చూపి లక్షలకు లక్షలు దండుకున్నట్లు తెలిసింది. ఇంతటితో ఆగకుండా 1993 నవంబర్‌ నుంచి 2018 ఏప్రిల్‌ వరకు కంప్యూటర్‌ ఇంక్రిమెంట్‌ అరియర్స్‌కు సంబంధించి 3 వేల మందికి గతేడాది నవంబర్‌ నెలలో ఇంక్రిమెంట్‌ అరియర్స్‌ ఇచ్చారు. ఇందులో ఒక్కొక్కరికి లక్ష నుంచి మూడు లక్షల వరకు ఇంక్రిమెంట్లు వస్తే మరో 15 మందికి మాత్రం ఒక్కొక్కరికి రూ.9 లక్షల మేర ఇంక్రిమెంట్‌ డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి కూడా ఆ అధికారి ఒక్కొక్కరి వద్ద రూ. 2 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. దీంతోపాటు గత నెలలోనే మరో 10 మందిని నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేసి ఒకొక్కరి దగ్గర నుంచి రూ.లక్ష వసూలు చేసినట్లు తెలిసింది. ఇలా ఆయన నెల రోజుల్లోనే లక్షలకు లక్షలు దండుకు బదిలీపై వెళ్లిపోయినట్లు తెలిసింది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపాలని పలువురు బ్యాంకు ఉద్యోగులు, యూనియన్‌ నాయకులు డిమాండ్‌ చేస్తున్నారు.

క్రెడిట్‌ కార్డు బిల్లు కట్టమన్నందుకు..

అవమానభారంతో యువకుడి ఆత్మహత్య


శ్రీకాంత్‌(ఫైల్‌)


శ్రీకాంత్‌ మృతదేహం

మదనపల్లె : క్రెడిట్‌ కార్డు బిల్లు చెల్లించకపోవడంతో, బ్యాంక్‌ సిబ్బంది ఇంటివద్దకు వచ్చి నిలదీయడంతో అవమానంగా భావించి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. వేంపల్లె పంచాయతీ జంగావారిపల్లెకు చెందిన రెడ్డెప్ప, కాంతమ్మ దంపతుల ఏకైక కుమారుడు శ్రీకాంత్‌(25) పట్టణంలోని ప్రైవేట్‌ ఎలక్ట్రానిక్స్‌ షోరూంలో సేల్స్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే పనిచేస్తున్న ములకలచెరువు మండలం దేవలచెరువుకు చెందిన అనిల్‌కు తనపేరుపై ఉన్న క్రెడిట్‌కార్డు ద్వారా రూ.3లక్షల రుణం తీసిచ్చాడు. అయితే, అతను సకాలంలో రుణం చెల్లించకపోవడంతో బ్యాంక్‌ సిబ్బంది నుంచి వేధింపులు అధికమయ్యాయి. దీంతో తాను వ్యక్తిగతంగా దాచుకున్న డబ్బులతో పాటు కొంతమేర అప్పుచేసి మూడో వంతు రుణం చెల్లించాడు. ఇంకా రూ.40వేలు చెల్లించాల్సి ఉంది. ఈ నగదు చెల్లింపు కోసం శనివారం బ్యాంక్‌ సిబ్బంది శ్రీకాంత్‌ ఇంటివద్దకు వెళ్లి వెంటనే చెల్లించాలంటూ ఒత్తిడి చేసి నిలదీశారు. దీన్ని అవమానంగా భావించి మనస్తాపంతో ఆదివారం ఉదయం ఇంటివద్దే పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీ గదికి తరలించారు.

చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


చెరువు నుంచి మృతదేహాన్ని వెలికి తీస్తున్న ఎస్‌ఐ

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల చెరువులో గుర్తు తెలియని మగ వ్యక్తి (40) మృతదేహాన్ని గుర్తించినట్లు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. ఆదివారం పోలీసులు చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తెచ్చారు. ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడా? లేక హత్యా? ఆత్మహత్యా? అన్న విషయం తేలాల్సి ఉంది.

టాటాఏస్‌ వాహనం బోల్తా

యువకుడి మృతి


మృతి చెందిన సింహాద్రి

కాశినాయన : మండలంలోని బసనపల్లె గ్రామ సమీపంలోని మలుపు వద్ద ఆదివారం టాటాఏస్‌ వాహనం బోల్తాపడటంతో బి.సింహాద్రి (18) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ యోగేంద్ర తెలిపిన వివరాల మేరకు ఆకులనారాయణపల్లె గ్రామంలో ఓ కార్యక్రమానికి షామియానా టెంట్‌ వేశారు. కార్యక్రమం అయిపోయిన తర్వాత టెంట్‌ తీసేసి సామాన్లు వేసుకుని పోరుమామిళ్లకు వెళుతుండగా బసనపల్లె మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి టాటాఏస్‌ వాహనం బోల్తాపడింది. దీంతో వాహనం ట్రాలీలో కూర్చొని ఉన్న సింహాద్రితో పాటు మరో ఇద్దరు కిందపడ్డారు. వెంటనే స్థానికులు 108 వాహనంలో పోరుమామిళ్ల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో సింహాద్రి మృతి చెందాడు. మరో ఇద్దరిలో ఒకరికి గాయాలు కాగా మరొకరికి ఎలాంటి గాయాలు కాలేదు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రిలో ఉంచామని ఎస్‌ఐ తెలిపారు. రెడ్డికొట్టాల ఎస్సీ కాలనీకి చెందిన పెద్దవెంగయ్య కుమారుడు సింహాద్రి మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.